




## ఉష్ణోగ్రత (అంచనా)

| 19-4-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 41 | 28 |
| తెనాలి | 40 | 28 |
| నరసరావుపేట | 41 | 28 |
| బాపట్ల | 36 | 29 |
| రెంటచింతల | 42 | 28 |

# కోలాహలంగా..

## ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం







యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతి, బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి,దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిని అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

- విజేతలకు బహుమతులు అందజేసిన వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్
- ప్రథమ బహుమతిగా బైకు, ద్వితీయ బహుమతిగా ఫ్రిడ్జ్, తృతీయ బహుమతిగా కలర్ టీవీ అందజేత
- 125 మందికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం.. విజేతల్లో ఆనందోత్సాహాలు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కోలాహల వాతావరణంలో జరిగింది. శుక్రవారం గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అంద జేశారు. గతంలో ఆంధ్రజ్యోతి పత్రికలో ముద్రితమైన కూపన్లను పాఠకులు ఆంధ్రజ్యోతి కార్యాలయంలో అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి ఆధ్వర్యంలో ఆయా కూపన్లలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆయా విజేతలకు శుక్రవారం ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, పాఠకుల సమక్షంలో బహుమతులను అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతిగా బైకును అందజేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన ఎస్‌డీబీ బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి కింద ఫ్రిడ్జ్ అందచేశారు. పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు చెందిన దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిగా కలర్ టీవీని అందజేశారు. మరో 125 మందికి ప్రోత్సాహక బహుమ తులుగా వివిధ రకాల గృహోపకరణాలను అందజేశారు.

### ఆంధ్రజ్యోతి కార్యక్రమాలు గర్వకారణం : విద్యాసాగర్

నేటి సమాజంలో పఠనాసక్తి తగ్గుతున్న క్రమంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. లక్కీడ్రాలు నిర్వహిస్తూ పాఠకులకు బహుమతులు అందజేయడం విశేషమ న్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పత్రికా పఠనాన్ని ఆంధ్ర జ్యోతి ప్రోత్సహిస్తుందన్నారు. నేటి సమాజంలో పత్రికల ద్వారానే వాస్తవాలు తెలుస్తాయని తెలిపారు. సమాజానికి దిక్సూచిలా పత్రికలు పనిచేస్తున్నాయన్నారు. నేటి ఆధునిక సమాజంలో పత్రికలు ఆవశ్యకత ఎంతో ముఖ్యమైనదని (మిగతా 6వ పేజీలో)



# పుడమికి.. పరీక్షలు

అవగాహన లేమితో కొందరు.. అధిక దిగుబడుల కోసమని మరికొందరు ఇష్టం వచ్చినట్లుగా.. అవసరం లేకపోయినా రసాయన ఎరువులను వాడుతూ భూ సారాన్ని నిస్సారం చేసేస్తున్నారు. ప్రమాదకర స్థాయిలో ఉన్న పుడమిని పరీక్షించి సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అటు నేల తల్లిని రక్షించి.. ఇటు రైతులను ఆదుకునేలా ప్రభుత్వం భూ ఆరోగ్య పరీక్షలపై దృష్టి సారించింది. సకల పోషకాలకు నెలవుగా ఉండాల్సిన భూమి రసాయనాలతో నాశనమవగా భూ సారం నానాటికీ తగ్గిపోతోంది. రసాయన ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ పరిస్థితుల్లో నేలలో ఏఏ పోషకాలు లోపించాయో గుర్తించి వాటిని మాత్రమే వినియో గించేలా రైతులకు చెప్పి వారిని చైతన్య పరిచేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమైంది. సాయిల్ టెస్ట్‌లు చేసి మే 15వ తేదీ కల్లా హెల్త్ కార్డులను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యంగా నిర్దేశించింది. అయితే భూసార పరీక్షలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

**ఈ పరీక్షలు చేస్తారు..**

నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్ఫరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా నేలల్లోని లోపాల ఆధారంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పోషకాలు వాడకం.. పంటల సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తారు.

- భూ ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- వచ్చే నెల 15 కల్లా హెల్త్ కార్డుల జారీ
- మూడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యం
- సాగుకు ముందే మట్టి పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక



నరసరావుపేటలోని భూసార పరీక్షా కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగులో భూసార పరీక్షలు ఎంతో కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా పరీక్షల ఆధారంగా భూ సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి కీలకమైన పుడమి ఆరోగ్య పరీక్షలకు వ్యవసాయ శాఖ సమాత్తమైంది. పంటలు సాగుకు ముందే మట్టి (మిగతా 6వ పేజీలో)





డాన్ బోస్కోలో ఏసుప్రభువుని సిలువ వేసిన దృశ్యం



### కిటకిటలాడిన సమాధుల తోట

గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆనందపేట సమాధుల తోట, పేరేచర్ల బస్టాండ్ వద్ద ఉన్న ఆర్‌సీఎం సమాధుల తోటలుక్రైస్తవులతో కిటకిటలాడాయి. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఆయా సమాధుల తోట ల్లో ప్రార్థనలకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు.



# భక్తిశ్రద్ధలతో.. శుభ శుక్రవారం

- చర్చిలు, సమాధుల తోటల్లో ప్రార్థనలు
- కన్నీరు పెట్టించిన శిలువ మార్గం దృశ్యాలు
- లోక పాప పరిహారానికే క్రీస్తు శిలువ మరణం: బిషప్ భాగ్యయ్య

గుంటూరు, గుంటూరు సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే పర్వదినాల్లో ఒకటైన శుభ శుక్రవారం(గుడ్‌ఫ్రైడే) వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్ని చర్చిలలో, సమాధుల తోటల్లోనూ కన్నీటి ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు ప్రభువు శిలువ మరణం పొందిన పవిత్రదినమైన గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు నాటి క్రీస్తుశ్రమలు, కష్టాలను గుర్తు తెచ్చుకుని కన్నీటి ప్రార్థనలు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ సమాధుల తోటల్లో కన్నీటి ప్రార్థనలు నిర్వహించారు. వారిని గుర్తు చేసుకుంటూ ఆయా సమాధులపై పుష్పగుచ్ఛాలు ఉంచి క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పలు చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. మాలలు వేసిన వారికి కొన్ని చోట్ల భోజనాలు ఏర్పాటు చేశారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని నిత్య సహాయ మాత ఆలయంలో ప్రత్యేక దివ్యబలి పూజ జరిగింది. క్రీస్తు శిలువ వేయబడిన విధానాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. శిలువపై మరణం పొందిన సమయంలో ఆయన నడిచిన 14 స్థలాలను గుర్తు చేస్తూ డాన్‌బాస్కోలోని విద్యార్థులు, విచారణలోని భక్తులు ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన దివ్య బలి పూజలో బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య మాట్లాడుతూ సర్వమానవాళిని పాప విముక్తులను చేయడానికే క్రీస్తు ప్రభువు శిలువ మరణం పొందారన్నారు. క్రీస్తుమార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ లూయిస్ తదితరులు పాల్గొన్నారు. ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత



గుంటూరులో సందేశం ఇస్తున్న బిషప్ భాగ్యయ్య

ఆగ్నేసమ్మ దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ నాగేతుచిన్నయ్య, స్తంభాలగరువులోని ఆగ్జిలియం స్కూల్‌లోని దివ్య బాలయేసు దేవాలయంలో ఫాదర్ పుట్టి సుందరరాజు, ఫాదర్ జోస్, నగరంపాలెంలోని పునీత అంతోనివారి దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ జ్యోతిరాజు, గోరంట్లలోని ఆరోగ్య మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ నరిశెట్టి బాలశౌరయ్య, ఫాదర్ నరిశెట్టి అల్ఫోన్స్, అమరావతిరోడ్డులోని వెళాంగిణిమాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ మర్రి అనిల్‌కుమార్, బొంగరాలబీడులోని లూర్దుమాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ అబ్రహ్మాం, పాతగుంటూరు చర్చిలో ఫాదర్ చిన్నారావుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆర్‌సీఎం చర్చిల పరిధిలో 14 స్థలాలను గుర్తు చేస్తూ శిలువ యాత్రలు నిర్వహించారు. గుంటూరులోని బాలయేసు పుణ్యక్షేత్రం, పునీతఆగ్నేసమ్మ దేవాల యాల ఆధ్వర్యంలో శిలువ మార్గం సాగింది. లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారిస్ చర్చిలో ఎస్‌జే బాబూరావు, జేమ్స్ సుధీర్, ఎం శ్యామ్యూల్‌జాన్, సీహెచ్ పురుషోత్తంచౌదరి, కిరణ్‌కుమార్, మధుబాబు, కే షాలేమ్ ప్రార్థనలు నిర్వహించారు. వెస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు సతీష్, మాణిక్యారావు, యువరాజ్, సెంట్రల్ గుంటూరు సెనెడ్ బిషప్ టీ శాంతారావు ప్రార్థనలు చేశారు. ఈస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు డీ చక్రధర్, ఆదాం, బీ విక్టర్, ప్రేమ్‌సాగర్ అర్ధరాత్రి ప్రార్థనలు చేశారు. ఏటి అగ్రహారంలోని సౌత్ ప్యారిస్ చర్చిలో జీ సురేష్‌బాబు, కొత్తపేట కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటీ ప్యారిస్‌లో జే దైవాశీర్వాదం, రమేష్, బీ లెనిన్, మాన్యం చర్చిలో పాస్టర్ గొట్టిపాటి భాస్కర్‌రావు ప్రార్థనల్లో పాల్గొన్నారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ మరణించకపోతే మానవాళికి ముక్తి లేదని యెరూషలేము ప్రార్థనా మందిరం పాస్టర్ ఎస్ సత్యంబాబు తెలిపారు.



# ఏఎంసీలు.. ఎప్పటికో?

- పాలకవర్గాల నియామకంలో జాప్యం
- జిల్లాలో ఐదు కమిటీలకు పాలకవర్గాల పెండింగ్
- ఏడాది సమీపిస్తున్నా ఇంకా పర్సన్ ఇన్‌చార్జిల పాలనే
- భర్తీ చేసి ఉంటే 90 మంది నేతలకు పదవీ అవకాశాలు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా జిల్లాలోని పలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నది. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పాత పాలకవర్గాలతో రాజీనామాలు తీసుకున్నారు. దాంతో వేగవంతంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తారని అంతా భావించారు. జిల్లాలో మొత్తం ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా ఐదు ఏఎంసీలలో పాలకవర్గాలు లేవు. పర్సన్ ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతున్నాయి. వీటికి ఎప్పటికి పాలకవర్గాలను నియమిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఆశావహుల్లో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది, తొమ్మిది నెలల తర్వాత మంగళగిరి, దుగ్గిరాల, రెండు రోజుల క్రితం ప్రత్తిపాడు ఏఎంసీకి చైర్మన్లను నియమించారు. కమిటీల కూర్పు కూడా కొద్దిరోజుల్లో పూర్తి చేసి మార్కెటింగ్ శాఖ పరంగా ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అయితే జిల్లాలో కీలకమైన ఏఎంసీల్లో ప్రధానమైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటున్నది. రూ.వేల కోట్ల టర్నోవర్‌ని కలిగిన ఈ మార్కెట్ కమిటీలో చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ పోస్టులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా తాము సూచించిన నాయకుడ్నే చైర్మన్‌గా నియమించాలని పట్టుబడుతుంటారు. అలానే తెనాలి, పొన్నూరు, ఫిరంగిపురం, తాడికొండ ఏఎంసీలకు కూడా నేటికీ పాలకవర్గాల నియామకం పూర్తి కాలేదు.

### రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో జాప్యం..

తొలుత రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ని జిల్లా స్థాయిలోనే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మార్కెటింగ్ అధికారులు ఎమ్మెల్యేలకు నివేదించి సంబంధిత ఏఎంసీని ఏ వర్గానికి రిజర్వేషన్ చేయాలో తీసుకుని కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆమోదంతో గెజిట్‌ని ప్రచురించాలి. అయితే మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఖరారు చేయాల్సి ఉండటంతో ఏకాభిప్రాయం కుదరక వాయిదా పడు తుంది. ఈ నేపథ్యంలో ఆర్‌వోఆర్‌ని ఖరారు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకున్నది. దాంతో జిల్లాలో రిజర్వేషన్ విషయంలో ఎలాంటి నిర్ణయం చేసే అవకా శం లేదు. అయినా ప్రభుత్వపరంగా నూతన కమిటీల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నది.

### కమిటీలు ప్రకటించి ఉంటే ఈపాటికే...

నూతన కమిటీలను గత ఏడాది ఆగస్టులో ప్రకటించి ఉంటే ఈ పాటికే ఎనిమిది ఏఎంసీలలో సుమారు 90 మందికి పదవులు వచ్చి ఉండేవి. ఏఎంసీల పదవీకాలం ఏడాదే. దీంతో మరో మూడు నెలల్లో రెండో విడత కమిటీలకు పాలకవర్గాలను నియమించి మరో 90 మందికి అవకాశాలు కల్పించే అవకాశం ఉండేది. ఇప్పుడు జాప్యం జరుగుతుండటం వల్ల పార్టీ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగని పరిస్థితి తలెత్తింది.



సచివాలయం సమీపంలో ఎస్పీడీవో కార్యాలయ నూతన భవనం

# రాజధానిలో ఎస్పీడీవో కార్యాలయం

**వెలగపూడిలో రూ.కోటి 50 లక్షలతో నిర్మాణం**

- మోదీ పర్యటన తర్వాత ప్రారంభించనున్న పోలీసు అధికారులు

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పోలీసులకు ప్రత్యేకంగా సొంత భవనం నిర్మాణం సమకూరింది. రాజధాని పరిధిని ప్రత్యేకంగా సబ్‌డివిజన్ చేసినా ఇంతకాలం సొంత భవనం లేదు. ఈ పరిస్థితుల్లో వెలగపూడి రెవెన్యూలో ఎస్పీడీవో(సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసు) నిర్మాణం పూర్తి అయ్యింది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం పక్కన ఉత్తరం వైపు స్థలంలో మూడేసి వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 1గా ఈ భవనాన్ని నిర్మించారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ రూ.కోటి 50 లక్షలతో నిర్మించింది. ప్రధానిమంత్రి మోదీ వచ్చే నెల 2న అమరావతి పర్యటన తర్వాత ఈ ఎస్పీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పోలీసు ఉన్నతాధికారులు చెప్తున్నారు. మందడంలో ఓ అద్దె భవనంలో ఈ కార్యాలయం కొనసాగుతుంది. త్వరలో సొంత భవనం నుంచి పోలీసు అధికారులు పాలనా కార్యకలాపాలు సాగించనున్నారు.

# మెగా డీఎస్సీలో 1,143 పోస్టులు

● ఉమ్మడి గుంటూరు జిల్లాకు కేటాయింపు

● సబ్జెక్టుల వారీగా జాబితా సిద్ధం చేసిన విద్యాశాఖ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాల వారీగా ఇప్పటికే పోస్టుల వివరాలను ప్రభుత్వం సేకరించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి 1143 పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నాయి. విద్యాశాఖ సేకరించిన వివరాల ప్రకారం ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 35, హిందీ 54, ఇంగ్లీషు 61, గణితం 32, ఫిజికల్ సైన్స్ 57, బయాలిజికల్ సైన్స్ 82, సోషల్ స్టడీస్ 102, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166, ఎస్జీటీ 306 పోస్టులను భర్తీ చేయనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 26, హిందీ 6, ఇంగ్లీషు 9, గణితం 4, ఫిజికల్ సైన్స్ 1, బయాలిజికల్ సైన్స్ 5, సోషల్ స్టడీస్ 9, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, ఎస్జీటీ 185 పోస్టులు భర్తీ చేయనున్నారు.

## 24న డీఎస్సీపై అవగాహన సదస్సు

గుంటూరు (విద్య )ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న డీఎస్సీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ డైరెక్టర్ రామన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం భర్తీ చేయబోతున్న 16,347 ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ప్రిపరేషన్, పరీక్ష విధానంపై అభ్యర్థులకు ఉచిత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. బ్రాడీపేట 2 / 11 కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు వక్తగా పాల్గొని అవగాహన కల్పిస్తారని తెలిపారు. వివరాలకు బ్రాడీపేట లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## ఏడీఆర్ఎంగా రమేష్‌కుమార్... సైమన్ బదిలీ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ అదనపు మేనేజర్(ఏడీఆర్ఎం)గా ఎం.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఐఆర్ఎస్ఈ/ ఎన్ఎఫ్ఎస్ఏజీకి చెందిన ఆయన ఎన్‌హెచ్ఎస్ ఆర్‌సీఎల్‌లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. డిప్యూటేషన్ నుంచి వెనక్కు రప్పించిన రైల్వేబోర్డు గుంటూరు ఏడీఆర్ఎంగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఏడీఆర్ఎం కె.సైమన్ బదిలీ అయ్యారు. ఆయనకు నూతన పోస్టింగ్ త్వరలోనే ఇవ్వనున్నట్లు పేర్కొంది.





ప్రధాని మోదీ పర్యటనకు విస్తృతంగా జరుగుతున్న ఏర్పాట్లు





# అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

● ప్రధాని మోదీ పర్యటనకు సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి పునర్నిర్మాణ పనులకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 2వ తేదీ జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక భాగంలోని సభాస్థలి ప్రాంగణంలో పనులు ఇప్పటికే మొదలయ్యాయి. భారీ టెంట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల కోసం ఒక టెంట్ ఆఫీసును సిద్ధం చేశారు. సభాస్థలిలో గ్యాలరీల భాగాన్ని భారీ ఎత్తున యంత్రాలు, రోడ్డు రోలర్లతో చదును చేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది రానుండటంతో భారీ గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను తొలగిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రీన్‌బెల్టుల్లో భారీగా లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పూల మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ స్తంభాలకు రంగురంగుల ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ఇక సభాస్థలిని కొండపల్లి బొమ్మలతో అందంగా అలంకరించనున్నారు.



# రాజకీయ సన్యాసం చేసి..శరణు కోరు



● మాచర్లకు ఏం చేశావు పిన్నెల్లి
● వచ్చే ఏడాది వరికపూడిశెలను పూర్తి చేస్తాం
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ధ్వజం

మాచర్లటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేసి, వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట తప్పారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శుక్రవారం తన జన్మదినం సందర్భంగా నెహ్రూ నగర్‌లోని వీవీఎన్ గార్డెన్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గానికి ఏం చేశావు పిన్నెల్లి అంటూ మాజీ ఎమ్మెల్యేను నిలదీశారు. 15 ఏళ్లుగా నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచి నాశనం చేసిన పిన్నెల్లి బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పి.. శరణు కోరాలని డిమాండ్ చేశారు. అలాగే జగన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను కూల్చి చేసిన పాపాలే నేడు ఏపీకి శాపాలుగా మారాయని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ అవినీతి పాలనలో అరాచకం, అవినీతి, దోపిడి, దౌర్జన్యాలు, దాడులపై శ్వేత పత్రాలను విడుదల చేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీ ప్రజలు సుపరిపాలన చూస్తున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాచర్లను అభివృద్ధి చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.800 కోట్లకు పైగా నిధులు తాగునీటికి కేటాయించగా, రహదారులకు, మౌలిక వసతులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయన్నారు. కేంద్రీయ విద్యాలయానికి రూ. 25 కోట్లు, అమృత స్కీం కింద రూ.100 కోట్లు, సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద రోడ్లకు రూ.115 కోట్లు మాచర్లకు కూటమి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కోలాహలంగా.. ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం



విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రజ్యోతి డీజీ ఎం ఎస్. రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్.సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ ఎం సుబ్బారావు, టెక్నికల్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

### సంతోషంగా ఉంది



ఆంధ్రజ్యోతి లక్కీడ్రాలో బహుమతి గెలుస్తామని అనుకోలేదు. ప్రథమ బహుమతి కింద బైకును గెలుపొందినట్లుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దీంతో చాలా సంతోషం కలిగింది. ఆంధ్రజ్యోతి పాఠకులుగా ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్నాం. ఆంధ్రజ్యోతి పత్రిక, ఏబీఎన్ న్యూస్ ఛానల్ అంటే ఎంతో ఇష్టం. ఎండీ రాధాకృష్ణ, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-యడ్లపల్లి గౌరి (ప్రథమ బహుమతి విజేత)

### ఆంధ్రజ్యోతి వార్తలు నచ్చుతాయి



పదిహేను సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పాఠకుడ్ని. ప్రతి రోజు పేపర్ చదువుతా. ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు బాగా నచ్చుతాయి. ఎండీ రాధాకృష్ణ కొత్త పలుకు శీర్షికలో ఎన్నో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు.

-(బిహారి సాహెబ్, ద్వితీయ బహుమతి విజేత)

### ఆంధ్రజ్యోతి పత్రిక అభిమానిని



కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకులం. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌లో వచ్చే వార్తలు, చర్చలు, ఓపెన్ హార్ట్‌విత్ ఆర్కే వంటి కార్యక్రమాలు బాగా నచ్చుతాయి. ప్రతిరోజు ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతాను. ఏబీఎన్‌లో వచ్చే న్యూస్ చూస్తుంటాము. తృతీయ బహుమతి కింద కలర్ టీవీ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- దొరడ్ల సుజాత(తృతీయ బహుమతి విజేత)

# మొదలైన ఆహ్వాన నాటిక పోటీలు



విడాకులు కావాలి.. నాటికలోని సన్నివేశం

పెదనందిపాడు, ఏప్రిల్, 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానిలో ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సౌజన్యంతో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రోటరీ శాతబ్ది గవర్నర్ జాష్టి ప్రమీలా రంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేధాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తడం సహజమని, అంతమాత్రాన కలిసి బతకలేమన్న తొందరపాటుతో విడాకులు కావాలనుకోవడం ఎంతవరకు సమంజసం ఈ నాటికి ప్రశ్నించింది. ద్వితీయ నాటికగా గుంటూరు వారి అమరావతి ఆర్ట్స్ చిగురు మేఘం, తృతీయ నాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మాస్వ రూపం ప్రదర్శించారు. తొలుత అక్షయ పాఠశాల విద్యార్థుల భరత నాట్యం ఆకట్టుకుంది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా నుసుము నాగభూషణం, మానాపురం సత్యనారాయణ, కూచి రామాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షులు, అధ్యక్ష కార్యదర్శులు ముద్దన రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పరంకుశం శ్రీనివాసరావు, ఏఆర్ ప్రభాకర్, తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, జనసేన నియోజిక కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు అమదాలపల్లి నరేంద్ర, బండారు రాంబాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాష్టి ప్రమీలా రంగారావు

# పుడమికి పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు పూర్తిచేసి నేల హెల్త్‌కార్డులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మే 15 కల్లా పరీక్షలు పూర్తి చేసి హెల్త్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. పరీక్షలు ఆధారంగానే పంటల సాగుపై రైతులకు సూచనలు చేయనున్నారు. అయితే గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఏడాది కూడా విస్తృతంగా భూసార పరీక్షలు చేశారు. బాపట్ల జిల్లాలో 17,201 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 10,800, పల్నాడు జిల్లాలో 17,700 భూసార పరీక్షలు నిర్వహించి రైతులు నేల ఆరోగ్య కార్డులను రైతులకు అందజేశారు. ఈ ఏడాది భూసార పరీక్షల లక్ష్యాలను పెంచారు. పల్నాడు జిల్లాలో 23,437, బాపట్ల జిల్లాలో 22,825, గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాల పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాలను నిర్ధారించి లోపాలు ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. రైతులు కూడా భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. నేల ఆరోగ్యం, పోషకం సామర్థ్యాన్ని బట్టి ఎరువుల వాడకం తెలుసుకోవచ్చంటున్నారు. పంటల దిగుబడి సరిగా లేకపోవడం.. సూక్ష్మ పోషకాల వంటి సమస్యలను పరీక్షల ద్వారా గుర్తించి వాటిని నివారణకు వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తారు.

### గత ఏడాది లోపాలు ఇలా..

● గత ఏడాది నిర్వహించిన భూ పరీక్షల్లో పల్నాడు జిల్లాలో నత్రజని, ఆర్గానిక్ కార్బన్ తక్కువగా ఉన్నట్లు తేలింది. పీహెచ్ తటస్థంగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో జింక్, ఐరన్, పాస్పరస్ మోతాదు తక్కువగా నిర్ధారించారు.

● బాపట్ల జిల్లాలో నత్రజని, పాస్ఫరస్, ఇనుము, జింక్ మాంగనీస్, కార్బన్ సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. పీహెచ్ విలువ తటస్థంగా ఉంది.

● గుంటూరు జిల్లాలో జరిపిన నేల ఆరోగ్య పరీక్షల్లో నత్రజని, ఇనుము లోపాలు ప్రధానంగా నిర్ధారించారు.

### పరీక్షలు సరే.. పోషకాల పంపిణీ?

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, బాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. వైసీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీని నిలిపేసింది. దీంతో రైతులు ఐదేళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత ఏడాది సూక్ష్మపోషకాలను పంపిణీ చేయలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు వ్యాపారులను ఆశ్రయించి దోపిడీకి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో భూసార పరీక్షలతో పాటు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

# గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు

● రెండు నెలల్లో రోగులకు అందుబాట్లోకి తెస్తాం

● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో రెండు నెలల్లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు (టోటల్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ) అందుబాట్లోకి తెస్తున్నామని ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రకటించారు. ప్రతి శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న 'మీ కోసం మేము' కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ ప్రకటన చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. అప్పట్లో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ కామినేని శ్రీనివాస్ కూడా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో ఈ ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఇటీవల రోగుల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లను తిరిగి ప్రవేశపెట్టేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ గతంలో తాము ఇంపోర్టెడ్ నీ ఇంప్లాంట్లు వాడామని, ఒక్కొక్క మోకీలు మార్పిడి సర్జరీకి రూ.1.70 లక్షలు ఖర్చు అయ్యిందని తెలిపారు. రెండు మోకీళ్ల మార్పిడికి రూ.3.40 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ల నిర్వహణ విషయమై ప్రభుత్వంతో మాట్లాడామని, మరో రెండు, మూడు నెలల్లో నీ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు అవసరమైన వారు ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు.

తోట చంద్రయ్య హత్య కేసులో

# స్పెషల్ పీపీగా హరిబాబు

● ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర హోంశాఖ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీ నేత తోట చంద్రయ్య హత్య కేసులో స్పెషల్ పీపీగా హైకోర్టు న్యాయవాది, టీడీపీ లీగల్‌సెల్ నాయకుడు మాగులూరి హరిబాబును నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసును సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పలువురు నిందితులకు తాజాగా నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. తోట చంద్రయ్యను 2022 జనవరి 12న వైసీపీ గూండాలు ఆయన స్వగ్రామం గుండ్లపాడులోనే అత్యంత దారుణంగా హతమార్చారు. మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సమయంలో తోట చంద్రయ్య గుండ్లపాడుతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలించారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీకి చెందిన ఎంపీపీ చింతా శివరామయ్య, ఆయన కుమారుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైసీపీ గుండాలు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తోట చంద్రయ్యను వెంటాడి, దారుణంగా హతమార్చారు. ఆయనపై దాడి చేసే సమయంలో జై జగన్, జై వైసీపీ అంటే ప్రాణాలతో వదిలేస్తామని హెచ్చరించారు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ చంద్రయ్య జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. దీంతో చంద్రయ్యను దారుణంగా నరికి చంపారు. కూటమి ప్రభుత్వం తోట చంద్రయ్య కేసును సీఐడీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా టీడీపీ లీగల్ సెల్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది మాగులూరి హరిబాబును నియమిస్తూ శుక్రవారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన హరిబాబు గతంలో గుంటూరు జిల్లా కోర్టులోనూ పనిచేశారు.

# బైక్ ఢీకొని మహిళ మృతి



షేక్ షంషాద్ బేగం మృతదేహం

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మైనర్ బైక్‌తో ఢీకొట్టడంతో మహిళ మృతిచెందిన ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ ఆర్.రాంబాబు వివరాల మేరకు.. పట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన షేక్ షంషాద్ బేగం(56), చేబ్రోలు నుంచి బాపట్లకు బస్సులో వచ్చినట్లు టికెట్ ఉంది. బంధువు చనిపోతే చూడడానికి వచ్చిన షంషాద్ బేగంను జీబీసీ రోడ్డులోని వన్‌వే వద్ద ఓ మైనర్ బాలుడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆమె పడిపోయి తలకు గాయం కావడంతో స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. వీఆర్వో నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసి, అనంతరం వివరాలు సేకరించినట్లు సీఐ తెలిపారు. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన మైనర్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్ర వారం నాటికి 515.00 అడుగులు ఉంది. ఇది 140.31 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 121, 129, 140 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 228.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 238.00 |

## కళలను, కళాకారులను ప్రోత్సహించటమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కళలను, కళాకారులను ప్రోత్సహించటమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై శ్రీ టీవీ, కళాంజలి క్రియేషన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర నాటకోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కళాకారులకు కొదవ లేదని, వారికి సరైన వేదికల లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలోనే కళా పోషకులకు అని సౌకర్యాలతో కూడిన వేదికలను ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ దర్శకత్వం వహించిన కవిరాజు విజయం పద్యరూపక టెలిఫిలిమ్ ప్రదర్శన కళాభిమానులను అలరించింది. తొలుత దూరదర్శన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఏవీ కృష్ణ మోహన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కవిరాజు సాహితీ సమితి అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బయ్య ప్రారంభించారు. ఆలోకం పెద్దబ్బయ్యకు జీవీ ఆంజనేయులు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు.



ఆలోకం పెద్దబ్బయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

## అంబేద్కర్ ఆలోచనే.. బీజేపీ సిద్ధాంతం

- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ అంబేద్కర్ ఆలోచనా విధానం బీజేపీ సిద్ధాంతానికి దగ్గరగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక రాజేంద్రనగర్ గొట్టిపాటి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి పక్షోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భిన్న సంస్కృతుల వారి నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొని అందరికీ అనుసరణీయమైన దేశానికి రాజ్యాంగాన్ని అంబేద్కర్ అందించారని అన్నారు. భారత దేశ కరెన్సీపై గాంధీ ఫొటోతో పాటు అంబేద్కర్ ఫొటో ముద్రించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకి తూట్లు పొడిచిన పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెసేనని విమర్శించారు. భారత రత్న ఇచ్చి పార్లమెంట్‌లో చిత్రపటం ఏర్పాటు చేసి అంబేర్కకు బీజేపీ సముచిత స్థానం ఇచ్చిందని అన్నారు. ప్రజాహితం, దేశ హితం కోసమే బీజేపీ రాజ్యాంగ సవరణలు చేసిందని అన్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, యడ్లపాటి రఘునాధబాబు, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, అంబేద్కర్ జయంతి పక్షోత్సవాల ప్రోగ్రామ్ కన్వీనర్ పాండురంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాకా వెంకట సత్యనారాయణ, పాల్గొన్న దారా సాంబయ్య తదితరులు

## క్రైస్తవ సమాధుల తోటలకు స్థలాలను కేటాయించాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే నగరంలో నాలుగు వైపుల నాలుగు సమాధుల తోటలను ఏర్పాటు చేసి క్రైస్తవ సమాజానికి తోడ్పాటు అందించాలని సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర బాబు విజ్ఞప్తి చేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆనందపేటలోని సమాధుల తోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ఒక్కొక్క సమాధిలో మూడు నుంచి నాలుగు మృతదేహాలను పాతి పెట్టడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి గోరంట్లలో స్థలం కేటాయించేలా కార్యచరణ రూపొందించిందని గుర్తు చేశారు. అ తరువాత వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై హైకోర్టు జడ్జీ పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు, దార్ల అర్జున్ కుమార్, కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆనందపేట, సమాధుల తోటలో నిరసన ప్రదర్శన చేస్తున్న దళిత సంఘ నాయకులు

## రేపు 'ఆమె' కవితల సంపుటి ఆవిష్కరణ

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన 'ఆమె' కవితల సంపుటిని ప్రముఖ భాషా సేవకులు డాక్టర్ తూమాటి సంజీవరావు (చెన్నై) హాజరై బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగే కార్యక్రమంలో అవిష్కరిస్తారని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎన్‌టీఆర్ గురించి అపోహలు' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారన్నారు. 'ఈ మాసం కవి'గా తోట వెంకటేశ్వరరావు (హైదరాబాద్) పాల్గొంటారని, 'నిక్కచ్చి కవిత' పోటీలో 'హక్కులు బాధ్యతలు' అనే అంశం మీద కవులందరూ తమ కవితలు వినిపించవచ్చని రంగారావు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-2 డీఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పండరీపురం, అశోక్‌నగర్, దేవపురం, కృష్ణనగర్, కోబాల్డ్‌పేట, పట్టాభిపురం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## జాషువా స్మారక చిహ్నంగా తీర్చిదిద్దాలి



జాషువా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆనందపేట శ్మశాన వాటికలో ఉన్న గుర్రం జాషువా సమాధిని స్మారక చిహ్నంగా తీర్చి దిద్దాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని ఆనందపేటలోని శ్మశానవాటికలో గుర్రం జాషువా సమాధిని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. జాషువా పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు నగరంలోని ఉల్ఫ్ హాల్ గ్రౌండ్ ఎదుటనున్న ఆర్‌డీ కార్యాలయం ప్రాంగణంలో పనులు కూడా చేపట్టామని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆ పనులను అటకెక్కించిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విజ్ఞాన కేంద్రాన్ని, స్మారక చిహ్నాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ జన సేవా సమితి నాయకులు అత్తోట జోసఫ్, న్యాయవాది గడ్డం ఎలీషా, అప్పారావు, దాసరి జాన్‌బాబు, సోపాటి రమేష్, జేమ్స్ తదితరులున్నారు.

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



బస్టాండ్ దగ్గరలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద..



బస్టాండు ఎదురు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద..



కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కాసు వెంగళరెడ్డి విగ్రహం ముందు..

## కార్పొరేషన్ నిర్లక్ష్యం... ఫౌంటెన్‌లకు శాపం

ఊరి మధ్యలో.. కూడళ్లలో ఉండే.. వాటర్ ఫౌంటెన్‌లను చూస్తుంటే కనువిందు మాత్రమే కాదు.. మనసు పులకిస్తుంది. అటువంటి వాటర్ ఫౌంటెన్‌లు గుంటూరు నగరంలో చాలా ఉన్నాయి. కానీ నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో వాటికి సంపూర్ణంగా గ్రహణం పట్టింది. ఎక్కడ చూసినా ఒక్క వాటర్ ఫౌంటెన్ కూడా పని చేయటం లేదు.


దీర్ఘకాలంగా పని చేయక పోవడం వల్ల చెత్తా చెదారం పేరుకుపోయి చూడటానికి ఇబ్బందికరంగా ఉన్నాయి. నగరాన్ని అందంగా ఉంచడానికి అటువంటి వాటిపై దృష్టి సారిస్తే సరిపోతుంది అన్న భావన చాలా మందిలో వ్యక్తం అవుతోంది. - **గుంటూరు (ఆంధ్రజ్యోతి)**



బీఆర్‌స్టేడియం ఎదురుగా ఉన్న ఇంకా ప్రారంభానికి నోచుకోని ఫౌంటెన్



గుజ్జనగుండ్ల ఇందిరాగాంధీ విగ్రహం చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న ఫౌంటెన్



నగరంపాలెం లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర ఉన్న ఫౌంటెన్ దుస్థితి

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి భారీ మూల్యం

- స్పీడ్ బ్రేకర్ల వద్ద ఇండికేషన్ పెయింట్ మరచిన అధికారులు
- వరుస ప్రమాదాలతో బెంబేలు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం సామాన్య ప్రజల ప్రాణాల మీద కొస్తోంది. నందివెలుగు రోడ్డులో వాహనాల అతివేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు ఎటువంటి ఇండికేషన్ పెయింట్ వేయకపోవడంతో అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్న విషయం కనిపించక నిత్యం వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో రోజుకు కనీసం రెండు, మూడు ప్రమాదాలకు తక్కువ జరగడంలేదని, ఇప్పటికే అనేకమంది తీవ్రంగా గాయపడ్డారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ ప్రమాదంలో ఓ యువకుడు మోకాలు విరిగి ఎముక బయటకు రావడం స్థానికులను తీవ్రంగా కలిచి వేసింది. తాజాగా జరిగిన మరో ప్రమాదంలో ఓ మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గడిచిన మూడు వారాల్లో దాదాపు పది మందికి పైగా క్షతగాత్రులైనట్లు స్థానికులు వాపోతున్నారు. స్పీడ్ బ్రేకర్లకు వైట్ కలర్ వేయాల్సిందిగా అనేకసార్లు తాము మున్సిపల్ కమిషనర్ నుంచి కిందిస్థాయి అధికారులు సిబ్బంది వరకు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నందివెలుగు రోడ్డులోనే కాక నగరంలోని అనేక ప్రాంతాల్లో వేసిన స్పీడ్ బ్రేకర్లకు పలుచోట్ల ఎటువంటి పెయింట్స్ గాని ఇండికేషన్స్ గాని లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో జరిగే ప్రమాదాల్లో బాధితులు తీవ్రంగా గాయాల పాలవుతున్నారన్నారు. తక్షణం ఆయా స్పీడ్ బ్రేకర్లకు ఇండికేషన్ పెయింట్స్ వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## మానవత్వం చాటుకున్న లాలాపేట పోలీసులు

- అత్యవసర పరిస్థితుల్లో గర్బిణీని ఆసుపత్రికి తరలింపు



గర్భిణీని అర్ధరాత్రి ఆసుపత్రికి తరలిస్తున్న లాలాపేట పోలీసులు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీసులు మానవత్వం చాటుకున్నారు. అర్ధరాత్రి సమయంలో నొప్పులతో సతమతమవుతున్న నిండు గర్భిణికి రవాణా సదుపాయం అందుబాటులో లేని సమయంలో విధుల్లో ఉన్న లాలాపేట పోలీసులు రక్షక్ వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. గురువారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఏటుకూరు రోడ్డులోని కమ్మ శేషయ్య గ్రౌండ్ ఏరియాలో లాలాపేట ఏఎస్సై నరసింహరావు గస్తీ నిర్వహిస్తుండగా, పక్కన ఉన్న నివాస గృహాల నుంచి ఒక మగ మనిషి వచ్చి మా ఆవిడ నిండు గర్భిణీ, కాన్పు నొప్పులతో ఇబ్బంది పడుతుందని, రవాణా సదుపాయం లేనందున ఆస్పత్రికి తీసుకెళ్లమని అడిగాడు. వెంటనే స్పందించిన ఏఎస్సై నరసింహారావు, కానిస్టేబుల్ నాగరాజు ఆమెను రక్షక్ వాహనంలో ఎక్కించుకొని జీజీహెచ్ కాన్పుల వార్డు వద్దకు తీసుకొని వెళ్లి హాస్పటల్లో చేర్పించారు. ఈ సందర్భంగా గర్భిణీ, వారి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చిలకలూరిపేట వై జంక్షన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అంకిరెడ్డిపాలెం వీఆర్‌ఓ కంభం మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతోనే మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదు. మృతదేహాన్ని గుర్తించిన వారు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## కాజలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మంగళగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాజ గ్రామంలోని పుల్లయ్య నర్‌కు చెందిన చావా వెంకాయమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.60,786ల చెక్కును స్థానిక కూటమి నేతలు శుక్రవారం అందజేశారు. తనకు సీఎం సహాయ నిధి మంజూరు చేయించిన మంత్రి నారా లోకేశ్‌కు వెంకాయమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

## పాప విమోచనకే క్రీస్తు శిలువ మరణం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సర్వ మానవాళి పాప విమోచనకే క్రీస్తు ప్రభువు సిలువ మరణం పొందారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని శుక్రవారం కొత్తపేటలో గల ట్రినిటీ ప్యారిస్ చర్చిలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రెండు వేల సంవత్సరాల క్రితం క్రీస్తు ప్రభువు పాప విమోచన, ప్రజల పాప క్షమాపణకు, ప్రజలందరి రక్షణకు తనను తాను సిలువకు అప్పగించుకున్నారన్నారు. మనుషుల పాపం తొలగించేందుకు పశువులనో, పక్షులనో బలి ఇస్తే కుదరదని, నీతిమంతుడైన మనిషి మరణించా లన్నారు. ఆ నీతిమంతుడైన మనిషే ఏసుక్రీస్తు అన్నారు. ఈ సందర్భంగా చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఆయా వేడుకల్లో పాస్టర్లు జె.దైవాశీర్వాదం, పి.రమేష్, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ నాయకుడు షేక్ మస్తాన్ వలి, బత్తుల లెనిన్, గ్రేస్ భీమరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేటలోని ట్రినిటీ ప్యారిస్ చర్చిలో మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

## డాక్టరేట్ సాధించిన ఆటోడ్రైవరుకు సత్కారం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌గా వృత్తి నిర్వహిస్తూ కాలికట్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పొందిన గండికోట శంకర్‌కు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య సత్కరించి అభినందించారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ గండికోట శంకర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కాలికట్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో ఇంటర్నేషనల్ ట్రేడ్ అంశం తీసుకొని దానిపై పరిశోధన చేసి పరిశోధన పత్రాలను సమర్పించడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ నేడు ఇంటర్నేషనల్ ట్రేడ్ ప్రధానమైన అంశంగా ముందుకు వస్తున్న నేపథ్యంలో కీలకమైన కష్టమైన అంశంపై పరిశోధన చేయటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు కే దుర్గారావు, జి శ్రీనివాసులు, కే సురేష్, ఎం పోలినాయుడు, కే నాగేశ్వరరావు, బి లక్ష్మణరావు తదితరులు పాల్గొని శంకర్‌ను అభినందించారు.



గండికోట శంకర్‌ను సత్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

## ఉరి వేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న పలకలూరు రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. శుక్రవారం సుమారు ఏడు గంటల సమయంలో గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో పెదపలకలూరు వీఆర్వో తోటకూర సుధీర్ కుమార్ ఘటన స్థలాన్ని చేరుకొని నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చొక్కా, ప్యాంటు ధరించి ఉన్న వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు కానీ, ఆనవాళ్లు కానీ లభించలేదని పోలీసులు తెలిపారు మృతుడిని గుర్తించిన వారు నల్లపాడు పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.





## రతన్‌టాటా జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం

- ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అ సాధారణ విజయాలతో భారత దేశానికి ఖ్యాతి తీసుకొచ్చిన రతన్ టాటా జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. లాం, మా లోటస్ ఇన్‌ఫ్రా లగ్జరియో వెంచర్‌లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రతన్ టాటా విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ దాతృత్వవాదిగా ఆయన సేవలు మన సమాజంపై చెరగని ముద్ర వేశాయని అన్నారు. పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్న రతన్‌టాటా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తున్నట్టు అన్నారు. టిస్కోన్ సంస్థ ఉమ్మడి రాష్ట్రాల సీనియర్ మేనేజర్ కొడాలి రమ్య మాట్లాడుతూ దేశానికి, టాటా సంస్థ అభివృద్ధికి రతన్‌టాటా చేసిన సేవలను కొనియాడారు. మరో అతిథిగా హాజరైన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ భారతీయుల మనస్సులో టాటా ఎప్పుడూ జీవించారని అన్నారు. కార్యక్రమంలో గద్దె తిరుపతిరావు, నారెడ్కో గుంటూరు చాప్టర్ అధ్యక్షుడు వంశీ, లోటస్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు కొలిశెట్టి అంకారావు, నాగండ్ల రాంబాబు, ఖండే శ్రీనివాసరావు, వంశీకృష్ణ, క్రెడాయ్ ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొని రతన్ టాటాకు ఘన నివాళులర్పించారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

## నేడు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ వారి సౌజన్యంతో అమరావవతి రోడ్‌లోని అన్నపూర్ణనగర్‌లో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి పది వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం జరుగుతుంది. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్య బృందంచే నాడీ పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ ప్రాబ్లమ్స్, సయాటికా, లైంగిక సమస్యలు, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సొరియాసిస్, పైల్స్ హెచ్ఐవీ/ఎయిడ్స్ వెన్నుపూస సంబంధిత వ్యాధులకు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులకు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

## కృష్ణా జలాల అంశంలో ప్రభుత్వ తీరు ఆందోళనకరం

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపక వివాద విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఆందోళన కలిగిస్తుందని విశ్లేషకులు ఇ చంద్రయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కృష్ణా జలాల పంపిణీ - రాష్ట్రానికి అన్యాయం అన్న అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగులు జలాలు వాడకం విషయంలో ఉన్న హక్కుపై రాష్ట్ర ప్రభుత్వం గట్టి వాదనలు వినిపించలేకపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ చేపట్టే ప్రతి ప్రాజెక్టు పైన ఎగువన ఉన్న తెలంగాణ ప్రభుత్వం కేఆర్ ఎంబీలోనూ, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు ఫిర్యాదులు చేస్తూనే ఉందన్నారు. ఇప్పటికే ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన ప్రభుత్వం దానికి అనుగుణంగా న్యాయవాదులను నియమించటంలో, గట్టి వాదనలు వినిపించటంలోనూ శ్రద్ధ చూపించటం లేదని విమర్శించారు. వాదనలు సరిగ్గా వినిపించకపోతే మిగుల జలాలు వినియోగ హక్కులు కోల్పోతామని, 2050 వరకు కృష్ణా జలాలను నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఎన్‌సదాశివం, సుబ్బారెడ్డి, సింగరయ్య తదితరులున్నారు.

## రజక సమస్యలపై పోరాడిన వెంకటేశ్వర్లు

- ఏపీ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రజక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలతో జీవితాంతం అవిశ్రాంతంగా పోరాడిన గొప్ప నాయకుడు బొంతల వెంకటేశ్వర్లు అని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బొంతల వెంకటేశ్వర్లు ఆరో వర్ధంతి కార్యక్రమం అరండల్‌పేట ఒకటో లైనులో అంబేద్కర్ మినీ హాల్లో శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగుజాతుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేసిన వెంకటేశ్వర్లు ఎమర్జన్సీ సమయంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి నెల్లూరు జైల్లో జైలు జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధన కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఈమని ఉమామహేశ్వరరావు, జీఆర్ భగత్‌సింగ్, మాల్యాద్రి, నీలాంబరం, శ్రీనివాసరావు, నూతలపాటి శివయ్య, రాము, కొండలరావు, పాశం కృష్ణ, కొల్లూరు నాగేశ్వరరావు తదితరులున్నారు.



వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూపూడి, భగత్‌సింగ్ తదితరులు

## ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియార్టీ, అర్హత ఉన్నవారికి సీఈవోగా పదోన్నతి కల్పించాలని మెప్మా ఆర్పీల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధనలక్ష్మి అన్నారు. పాతగుంటూరు, జిల్లా సంఘ విస్తృత సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పీడీ చెప్పారనే పేరుతో సీఈవో, సీఎంఎంలు అవసరం లేని సరుకులను, ఆదనపు రేట్లతో కొనుగోలు చేయాలని వేధించడం మానుకోవాలని అన్నారు. లాగిన్లు ఇవ్వకుండా ఆర్పీలతో ఎలా పని చేయిస్తారని ప్రశ్నించారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆర్పీలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఆర్పీ గుంటూరు జిల్లా నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షులుగా స్వాతి, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా అంకమ్మ, ఉపాధ్యక్షులుగా రమణ, బషీరా, సహాయ కార్యదర్శులుగా గుల్జార్, గౌస్య, గౌరవాధ్యక్షుడిగా దండా లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.



మాట్లాడుతున్న కే ధనలక్ష్మి, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

# బచ్చలి ఆరోగ్యానికి నెచ్చెలి

కారం, వగరు, తీపి ఈ మూడురుచులు కలగలసిన ఆకు కూర బచ్చలి. దీనిలో పాలకూరతో సమానమైన పోషకతత్వాలు ఉంటాయి. ఇది తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. భోజన కుతూహల గ్రంథంలో దీనిని పోతకి లేదా ఉపోదకీ అని పేర్కొన్నారు. ఈ బచ్చలిలో రెండు రకాలు ఉన్నాయి. ఆకుపచ్చ కాండం, ఆకుపచ్చ ఆకులతో ఉన్న బచ్చలిని బసెల్లా ఆల్బా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఎర్రని కాండం, ముదురు ఆకుపచ్చ ఆకులు కలిగిన బచ్చలిని బసెల్లా రుబ్రా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. దీని గింజలు ఊదా రంగులో ఉంటాయి. ఈ రంగును తెలుగు వారు బచ్చలిపండు రంగు అనే పిలుస్తారు.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

చాలా మంది బచ్చలి కూర వేడి చేస్తుందని భావిస్తారు. కానీ ఇది వాతాన్ని, వేడిని- రెండింటినీ అదుపు చేస్తుంది. ఆయుర్వేద గ్రంథాల్లో బచ్చలి కూర వల్ల ప్రయోజనాలను వివరించారు. ఆ ప్రయోజనాలు..

- ఇది రక్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎముకలకు పుష్టినిస్తుంది.
- అనేక రకాల స్త్రీ సమస్యలకు ఇది పరిష్కారం. సంతాన ప్రాప్తినిస్తుంది. గర్భాశయపోషకంగా పనిచేస్తుంది.
- బచ్చలి ఆకును నమిలితే నోటిపూతను నివారిస్తుంది. ఈ ఆకు రసంలో పసుపు కలిపి పెడితే గాయాలు త్వరగా మానతాయి. కాలిన గాయాలకు ఈ ఆకు రసం మందుగా పనిచేస్తుంది. ఈ రసాన్ని రాస్తే దురదలు తగ్గుతాయి.
- బచ్చలి కూరకు మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించే స్వభావముంది.
- బచ్చలి కూరలో జిగురు పదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మలబద్ధకం ఉన్నవారు బచ్చలికూరను తింటే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

### రకరకాల వంటలు

తెలుగువారు కంద బచ్చలి కూరను అన్ని శుభ కార్యాల్లోనూ వండుతారు. ఇక బచ్చలికూరతో రకరకాల రుచికరమైన వంటలు చేసుకోవచ్చు.

- బచ్చలికూరలో నూనె వేసి తాలింపు వేసి మూత పెట్టి మగ్గనిస్తే మెత్తగా అవుతుంది. దీనిలో ఉడికిన కందిపప్పు లేదా పెసర పప్పు వేసి పప్పుగా చేసుకోవచ్చు.
- బచ్చలికూరను సన్నగా తరిగి దీనిలో శనగ పిండి లేదా మొక్కజొన్న పిండి కలిపి కొద్దిగా నూనె వేసి వేయిస్తే రుచికరమైన కూర అవుతుంది. దీనిలో కొందరు కొబ్బరి తురుము, నువ్వుపప్పు కూడా వేస్తారు.
- బచ్చలి కూరను సన్నగా తరిగి దానిని నూనెలో దోరగా వేయించాలి. ఆ తర్వాత దానిలో తాలింపు, కొద్దిగా చింతపండు వేయాలి. దీనిని మిక్సీలో వేసి రుబ్బి పచ్చడిగా కూడా చేసుకోవచ్చు.




## దోసకాయ చేపల పులుసు

**కావాల్సిన పదార్థాలు:** చేప ముక్కలు- పావు కిలో, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, నూనె- పావు కప్పు, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- 4, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- అర చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, టమాటా గుజ్జు- అర కప్పు, ఉప్పు- తగినంత, చింతపండు రసం- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

**తయారీ విధానం:** ముందుగా చేప ముక్కలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పావు చెంచా పసుపు, పావు చెంచా ఉప్పు, పావు చెంచా కారం వేసి చేత్తో కలపాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, పావు చెంచా పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇవన్నీ దోరగా వేగాక అర చెంచా ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత దోసకాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ముప్పావు చెంచా కారం, గరం మసాలా పొడి వేసి కలపాలి. ఇవి కొద్దిగా వేగాక టమాటా గుజ్జు, చింతపండు రసం వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరవాత అర చెంచా ఉప్పు వేసి, రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. తరవాత చేప ముక్కలు వేసి మూతపెట్టి మగ్గించాలి. ఆరు నిమిషాల తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.




### జాగ్రత్తలు

- రోహు, కట్లా, శీలావతి, కొరమీను చేపలతో ఈ పులుసు చేసుకోవచ్చు. కానీ ముల్లు ఉండే రోహు చేపతో చేసిన పులుసు రుచికరంగా ఉంటుంది.
- దోసకాయ, చేప ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.

వంటిల్లు

**మనం దోసకాయలతో ఇగురు, పప్పు, ఆవకాయ... ఇలా ఎన్నో రకాలు చేస్తూ ఉంటాం. టమాటా, చిక్కుళ్లు లాంటివి చేర్చి రకరకాల కూరలు కూడా వండేస్తూ ఉంటాం. ఇవి కాక దోసకాయలతో మాంసాహార రుచులు కూడా ప్రయత్నించవచ్చు. దోసకాయలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ వంటకాలు.**

# దోసకాయతో వెరైటీగా..



## దోసకాయ వంకాయ పచ్చడి

### కావాల్సిన పదార్థాలు

- దోసకాయ ముక్కలు- ఒక కప్పు, వంకాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- పన్నెండు, చింతపండు- నిమ్మకాయంత, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, కరివేపాకు- రెండు రెమ్మలు, జీలకర్ర- ఒక చెంచా, అవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, నూనె- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిశనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు

### తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నెపెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, కొద్దిగా పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, వంకాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, చింతపండు, కొద్దిగా ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత అర కప్పు దోసకాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీ గిన్నెలో వెల్లుల్లి రెబ్బలు, వేయించిన వంకాయ-టమాటా ముక్కల మిశ్రమం వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద తాలింపు గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కొద్దిగా పసుపు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అరకప్పు దోసకాయ ముక్కలు వేసి కలపాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.



**దోసకాయ...**
**పులుపు, తీపి కలగలసిన రుచిలో ఉంటుంది. ఇందులో ఐరన్, కాల్షియం, పొటాషియం లాంటి మినరల్స్‌తోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. దోసకాయను తరచూ తినడం వల్ల ఎముకలు బలపడతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరానికి కావాల్సినంత తేమ లభిస్తుంది. చర్మం మృదువుగా బిగుతుగా మారుతుంది. రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు తగ్గుతాయి. దోసకాయలో ఉండే కుకుర్బిటాసిన్ ... మూత్రాశయ క్యాన్సర్‌ను నివారిస్తుంది.**

### జాగ్రత్తలు

- దోసకాయను చిన్న ముక్కలుగా కోయాలి. పాడవాటి వంకాయలు తీసుకుంటే పచ్చడి రుచిగా ఉంటుంది.
- గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని వేయించిన పల్లీలు వేస్తే పచ్చడికి కమ్మదనం వస్తుంది.
- ఈ పచ్చడిని రోట్లో చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది.

## దోసకాయ చికెన్ కూర

### కావాల్సిన పదార్థాలు

- చికెన్- 300 గ్రాములు, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకటిన్నర చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ధనియాల పొడి- అర చెంచా, నూనె- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

### తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలు, అర చెంచా ఉప్పు, అర చెంచా కారం, అరచెంచా అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నానబెట్టాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. ఇవన్నీ వేగాక నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కలపాలి. గిన్నెమీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత దోసకాయ ముక్కలు, ఒక చెంచా కారం, ఒక చెంచా ఉప్పు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరలో కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర రోటీ, చపాతీ, పుల్కా, వేడి అన్నంలోకి బాగుంటుంది.

### జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మగ్గుతున్నప్పుడు అందులో ఒక గరిటెడు పెరుగు కలిపితే కూర రుచిగా ఉంటుంది.
- దోసకాయను పెద్ద ముక్కలుగా కోయాలి.



పర్సనల్ కేర్

## చెవిలో పురుగు దూరితే..!

ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి..

- చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.
- ఆల్కహాల్‌లో చిన్న దూది వుండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ ఘాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. ఆలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.
- చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.
- ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.



సెలెబ్ టాక్

**ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, ట్వింకిల్ ఖన్నా! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!**



# పాత వాటికి కొత్త కళ

"ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

### పాత జ్ఞాపకాలు పదిలంగా...

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.



### అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్స్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."

మేకప్

## ఎండల్లో చూడచక్కగా...

ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

**ప్రైమర్:** గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పని చేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

**పౌడర్:** మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

**ఫౌండేషన్:** వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.



**మస్కారా:** ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

**లిప్ టింట్:** టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

## విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ

మంగళగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎస్‌పీఎస్‌డీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ తెలిపారు. మంగళగిరిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వారానికి రెండు రోజుల చొప్పున మూడు నెలలపాటు ఈ కోర్సును ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కొండలరావు, సభ్యులు పాల్గొన్నారు.



నెల్లూరు డీఎస్పీ రమణను సత్కరిస్తున్న డాక్టర్ శివనాగయ్య తదితరులు

## ఘనంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒక దేశం మూలాలను, ఉనికిని తెలుసుకునేందుకు ఆ దేశ సంస్కృతి, వారసత్వమే మూలాధారమని నెల్లూరు డీఎస్పీ ఎన్‌వీ రమణ అన్నారు. వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా కేఎల్‌యూలో బీఏ ఐఏఎస్ విభాగం ఆధ్వర్యంలో వికసిత భారత్- భారతీయ వారసత్వం - సాంస్కృతి అనే అంశంపై జరిగిన సదస్సుకు రమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మరో అతిథి పురావస్తు, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.స్వామినాయక్ మాట్లాడుతూ ఆదిమానవుడి నుంచి ఆధునిక మానవుడి వరకు వారి జీవన పయనంలో చోటు చేసుకున్న అనేక ఘట్టాలకు సంబంధించిన ఆధారాలను బాపు మ్యూజియం భద్రంగా పరిరక్షిస్తుందన్నారు. ప్రధాన వక్తగా ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు. బీఏ ఐఏఎస్ విభాగాధిపతి డాక్టర్ శివనాగయ్య, వీసీ సారథి వర్మ, ప్రోవీసీలు వెంకట్రామ్ ప్రసాద్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్ కేఆర్‌ఎస్ ప్రసాద్, డాక్టర్ అనిల్‌కుమార్, అద్దంకి ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు..



వెంకాయమ్మకు చెక్కును అందజేస్తున్న కూటమి నాయకులు

## సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కు అందజేత

మంగళగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాజ గ్రామంలోని పుల్లయ్య నర్‌కు చెందిన చావా వెంకాయమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.60,786 నగదు చెక్కును స్థానిక కూటమి నేతలు శుక్రవారం అందజేశారు. తనకు సీఎం సహాయ నిధి మంజూరుచేయించిన మంత్రి లోకేశ్‌కు వెంకాయమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడే చేర్పించాలని టీడీపీ సీనియర్ నాయకుడు కల్లూరి సుబ్బారావు కోరారు. గనికపూడి ఉర్దూ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు. చిన్నారులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ మహమ్మద్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్, అబ్దుల్ ఖాదర్, హెచ్‌ఎం షకీల బేగం పాల్గొన్నారు.

## వైభవంగా పోలేరమ్మకు కుంకుమ పూజ



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ

కాకుమాను, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరు స్వయంభు పోలేరమ్మకు కుంకుమ పూజ అత్యంత వైభవంగా శుక్రవారం జరిగింది. ఆలయ మండపంలో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ ఛైర్మన్ ముత్తినేని అనిల్‌కుమార్, ఈఓ బత్తుల సురేష్‌బాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ, పసుపు తదితర పూజా సామగ్రిని భక్తులకు పంపిణీ చేశారు. ఈ నెల 22న అమ్మవారి శిడిమాను ఉత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ, ఈవో తెలిపారు.

## కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు శంకుస్థాపన

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొర్నెపాడు గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో విమాన గోపురం, వాహన శాల, ధ్వజ స్తంభ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొనగా.. జీర్ణోద్ధరణ కమిటీ, వేద పండితులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శంకు స్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు, సోములు, సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

## 136వ రోజుకు చేరిన దీక్షలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారంతో 136వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో టి.దుర్గాభవాని, రమాదేవి, శారద, ఇమాంబి, రమణ కూర్చున్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయల్, బాషా, అక్కయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, అంకమ్మ, ఏడుకొండలు, శారమ్మ, సూర్యప్రకాశరావు, సాంబయ్య, గురవయ్య పాల్గొన్నారు.

## ఒరిగిన విద్యుత్ స్తంభాలు

తాడికొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. పొలాల్లో వేసి విద్యుత్ స్తంభాలు పక్కకి ఒరిగి పడిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి. తాడికొండ శివారు బడేపురం-నిడుముక్కల గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. కొన్ని స్తంభాలు రోడ్డుమీదకు వచ్చాయి. వర్షాకాలంలో రైతులు పొలం పనులకు వెళ్లేటప్పుడు, వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందిగా మమారనున్నాయి. వేసవిలో విద్యుత్ స్తంభాలను సరిచేయాల్సిన అవశ్యకత ఎంతైన ఉంది.

బడేపురం-నిడుముక్కల రోడ్డులో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు →



## క్రీస్తు మార్గంతోనే ప్రపంచ శాంతి



చిలువూరు గ్రామంలో క్రీస్తువేషధారణలో..

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు చూపిన మార్గంతోనే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందని రెవరెండ్ కొదమల జోసెఫ్ అన్నారు. క్రీస్తు సిలువ మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటూ మంగళగిరి సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు మరణానికి ముందు పలికిన ఏడు మాటలపై ధ్యానం చేశారు. నేలపాటి డేవిడ్, కె.రూఫస్, ఎం.సుజాత, కే.కవిత పాల్గొన్నారు.

● దుగ్గిరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ భక్తులు గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తుమ్మపూడి గ్రామానికి చెందిన బుస్సా మేరిబాబు క్రీస్తు వేషధారణలో శిలువ భుజాన మోస్తూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దలు, విచారణ గురువు యామర్తి సురేష్ ఆధ్వర్యంలో, రాయిపూడి ప్రసాద్ పర్యవేక్షణలో ఈ ప్రదర్శన జరిగింది. చిలువూరులోనూ క్రీస్తు వేషధారణలో చిలువూరు రవి శిలువ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఇతర గ్రామాల్లోని క్రీస్తు ప్రార్థన మందిరాల్లో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

● తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం నులకపేటలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. సంఘస్తులు ఏసుక్రీస్తు మరణానికి సంబంధించిన ఘట్టాలు సిలువ మార్గం నాటకం ద్వారా ప్రదర్శించారు. ప్రకాష్‌నగర్‌లోని ఆర్‌సీఎం దేవాలయం నుంచి అన్నమ దేవాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. విచారణ గురువులు ఫాదర్ దాసయ్య, పాపయ్య పాల్గొన్నారు.

## విపత్తుల వేళ జన సేవాదళ్ విశిష్ట సేవలు



ప్రసంగిస్తున్న కన్వీనర్ ఈశ్వరయ్య

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు జన సేవాదళ్ విశిష్టమైన సేవలు అందిస్తుందని జన సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. మంగళగిరి చినకాకాని గ్రామంలో జరుగుతున్న జన సేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు సాయం కోసం ఎదురుచూడకుండా.. జన సేవాదళ్ సైనికులు సహాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జన సేవాదళ్ సైనికులను తయారు చేసి, డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సీపీఐ శత వసంతాల వార్షికోత్సవాలకు రెడ్‌షర్ట్ వలంటీర్లు పెద్ద ఎత్తున కవాతు చేయనున్నారని తెలిపారు. జన సేవాదళ్ శిక్షణా తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లుగా నార్ల వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, హేమ శంకర్, మురళీ వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య నేతలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కుల పంపిణీ

మంగళగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టిడ్కో - ఎన్టీఆర్ నగర్‌కు చెందిన దోరా లీలావతి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.లక్షా 50 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు లెటర్ ఆఫ్ క్రెడిట్ చెక్కును స్థానిక టీడీపీ నేతలు లీలావతి కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

**పెదవడ్లపూడిలో...**

పెదవడ్లపూడి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను స్థానిక నేతలు శుక్రవారం పంపిణీ చేశారు. సాదం వెంకాయమ్మకు రూ.60 వేలు, మోపర్తి నాగేశ్వరరావుకు రూ.37,878 చొప్పున మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. తోట పార్థసారథి, మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు పాల్గొన్నారు.



ఛైర్మన్ నరసింహ యాదవ్‌ను కలిసిన టీడీపీ నేతలు

## బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గోళ్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. నవులూరు గ్రామానికి శుక్రవారం విచ్చేసిన ఆయనను స్థానిక నేతలు కలిశారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బడ్జెట్‌లో బీసీలకు రూ.876 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. తిరుపతిలో యాదవ భవన నిర్మాణం జరుగుతుందని, అలిపిరి శ్రీవారి పాదాల చెంతన శ్రీవారి తొలి దర్శనం చేసుకున్న శరభయ్య యాదవ్ విగ్రహ ప్రతిష్టపై కూడా కార్పొరేషన్ సమావేశంలో తీర్మానం చేశామని వెల్లడించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, నేతలు రుద్రు కోటేశ్వరరావు, బత్తుల సాంబశివరావు, శ్రీనివాసరావు, వెంకటేష్, మస్తాన్, నరసింహులు పాల్గొన్నారు.

# క్షీణించిన పారిశుధ్యం

- గ్రామంలో ముందుకు పారని మురుగు
- అసంపూర్తిగా కాలువల నిర్మాణం
- దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు
- మొక్కుబడిగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం

పెదనందిపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం మండల కేంద్రం పెదనందిపాడులో అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతుంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఎక్కడికక్కడ మురుగు తిష్టవేస్తుంది. కాలువల్లో చెత్తాచెదారాలు వేయడంతో మురుగునీరు పారుదల లేక నిలిచిపోయి దోమల బెడద అధికమైంది. దీనికి తోడు దుర్వాసన భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఏ కాలువలో చూసినా మురుగు ముందుకు పారని పరిస్థితి. గ్రామంలో కొన్నిచోట్ల కాలువలు పొడవగా మరికొన్ని చోట్ల అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పారిశుధ్యంపై దృష్టిసారించకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. కాలువలు శుభ్రం చేయించడంలో పంచాయతీ అధికారులు పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల బెడద అధికమవుతుందని, అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ఇక రాత్రివేళల్లో అయితే కంటిమీద కునుకు ఉంటే ఒట్టు అని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు పదేపదే చెబుతున్నప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, అంటు వ్యాధులు ప్రబలితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందిచే మురుగు కాలువలు పూడికలు తీయించి, రోడ్ల వెంట ఉన్న చెత్తచెదారాలను తొలించాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లాపరిషత్ హైస్కూల్ ఎదుట నిలిచిన మురుగునీరు



పోలీసు స్టేషన్ ఎదుట నిలిచిన మురుగునీరు



విష్ణాలయం ఎదుట పారుదల లేక నిలిచిన మురుగునీరు

**దోమల బెడద అధికంగా ఉంది: కంచు నాగరాజు, గ్రామస్థుడు**

గ్రామంలో మురుగు కాలువలు పూడికతీయకపోవడంతో కాలువల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయని, దీనికి తోడు దుర్వాసన భరించలేని పరిస్థితిలో ఉంటున్నామని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, ఈ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు



ఫిరంగిపురం: ప్రసంగిస్తున్న ఫాదర్ తుమ్మా కరుణాకరరెడ్డి



పెదనందిపాడు: సందేశమిస్తున్న పాస్టర్ శేఖర్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చినకోండ్రుపాడులో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కిషోర్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో క్రీస్తుకు సిలువ వేసే 14 స్థలాల సన్నివేశాలను గ్రామంలోని అన్ని వీధులలో ప్రదర్శిస్తూ నిర్వహించిన సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. క్రీస్తుకు మరణ దండన సన్నివేశాలను నాటక రూపంలో ప్రదర్శించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు.

● వట్టిచెరుకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ముట్లూరు పునీత శౌరివారి దేవాలయం, ఫాదర్ దిలీప్ కుమార్ పర్యవేక్షణలో సిలువ వేసే సన్నివేశాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శనలు నిర్వహించారు.

● పెదనందిపాడు, ఏప్రిల్, 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను భక్తులకు తెలియజేశారు. లోకపాప పరిహారార్థం క్రీస్తు సిలువ వేయబడ్డారని, క్రీస్తు వలె ప్రతి ఒక్కరూ శాంతి, దయ, క్షమా గుణం కలిగి ఉండాలని భక్తులకు సూచించారు.

● ఫిరంగిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు మానవాళి పాప పరిహారార్థం సిలువ పై ప్రాణ త్యాగం చేశారని ఫాదర్ తుమ్మా కరుణాకరరెడ్డి అన్నారు. శుక్రవారం ఫిరంగిపురంలోని బాల ఏసు కథెడ్రల్ దేవాలయంలో పవిత్ర దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. శిలువ పై మరణించిన క్రీస్తు క్రీస్తు సందేశం ఏమనగా మానవులు క్షమ, తగ్గింపు గుణం, సమాధానం కలిగి ఉండాలని ఆకాంక్షించారన్నారు. మాలపాటి పాతిమా మర్రెడ్డి, గురువులు ప్రవీణ్, రవీంద్ర, భరత్‌రెడ్డి, విలియం తదితరులు పాల్గొన్నారు.





పొగాకును పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

## పొగాకు మద్దతు ధర ప్రకటించాలి

పెదనందిపాడు, ఏప్రిల్, 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పొగాకు పంటకు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పొగాకు మండెలను శుక్రవారం పరిశీంచారు. అనంతరం తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు, మిర్చి రైతులను పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పొగాకు రు.15 నుంచి 18వేలు ఉండగా ఈ ఏడాది రు.8 వేలు ఉందని, మిర్చి గతంలో రు.20వేలు ఉండగా ప్రస్తుతం 10వేలు ఉందని దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. కౌలురైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, రైతు సంఘ నాయకులు సీహెచ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి అగ్నిమాపక దళాధికారి వై.వెంకటేశ్వర్లు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆత్మకూరు పరిధిలోని కోకాకోలా కంపెనీలో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వక్ఫ్ సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు తీర్పుతో ఉపశమనం

దుగ్గిరాల, 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై సుప్రీం కోర్టు తీర్పు ముస్లింలకు కొంత ఉపశమనం కలిగించిందని వైసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. స్థానిక ముర్తుజానగర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 300 ఏళ్లనాటి వక్ఫ్ ఆస్తులకు ఇప్పుడు డాక్యుమెంట్లు అడగడం, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులో సభ్యులుగా చేర్చాలనడం తదితర అంశాలపై సుప్రీంకోర్టు స్పందన, తదుపరి విచారణ వరకూ వక్ఫ్ బిల్లును యథాతదంగా ఉంచాలని చెప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. షేక్ రషీద్, హుస్సేన్, జిలాని, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



12వ రోజు సమ్మెలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు

## కొనసాగుతున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. యూనియన్ అధ్యక్షుడు డి.శివ మాట్లాడుతూ.. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.24,500 వేతనం, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి ఎం.రవి, నేతలు ఎం.యోహాను, జె.శ్రీకాంత్, ఆర్.కృష్ణ పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డును కొనసాగించాలి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సుదీర్ఘకాలం పోరాటం అనంతరం భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ప్రభుత్వం కొనసాగించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ గౌరవాధ్యక్షుడు సీహెచ్ భుజంగరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మహానాడులో బి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌ను కలవాలని నిర్ణయించారు. సాయి, వెంకటేశ్వర్లు, సుధాకర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ హర్షణీయం

పెదనందిపాడు, ఏప్రిల్, 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ అవలులోకి రావడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం అన్నారు. రావిపాడులో ఎస్సీ వర్గీకరణ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లెపాగ పాపారావు, కారుమూరి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకి రూ.కోటి ఇవ్వాలి

తాడికొండ(నిడుముక్కల)ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎకరాకు రూ.కోటి గిఫ్ట్‌గా ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని ఆంధ్రరాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు చేశారు. శుక్రవారం నిడుముక్కల గ్రామంలోని ఆంధ్రరాష్ట్ర సమితి ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. నగదుతో పాటు రైతులకు 1250 గజాల రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే 33 వేల ఎకరాలు పూలింగ్ ద్వారా తీసుకున్న భూములను అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేడికొండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పేరేచర్ల గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులకు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శంకుస్థాపన చేయనున్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ అంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థానికులతో కలసి పారిశుధ్య పనులను చేపట్టనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షలతో సైడ్ డ్రెయిన్స్ సీసీ రోడ్లు, వెట్ మిక్స్ రోడ్డు, పనులకు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఎంపీడీఓ పాటిబండ్ల పూర్ణ శంకర్రావు వెల్లడించారు.



# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

## నాటక రంగానికి సంపూర్ణత్వం తెచ్చిన బళ్లారి రాఘవ

● ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాటక రంగానికి బళ్లారి రాఘవ సంపూర్ణత్వం తీసుకువచ్చారని, ప్రేక్షకులను వేదిక వరకు రప్పించే ప్రతిభ ఆయన సొంతమని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అన్నారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శుక్రవారం వర్థంతి నిర్వహించారు. తెలుగు నాటక రంగానికి పెద్దబాలశిక్షగా ఉన్నారని, ప్రఖ్యాత నాటకకర్త బెనార్డ్‌షా ప్రశంసలు పొందిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



# ఆటో స్టాండ్‌లా గాంధీచౌక్

- తెనాలిలో అడ్డగోలుగా ఆటోల పార్కింగ్
- అడ్డుపెట్టారని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులే
- పాదచారులు అడుగు పెట్టటం కూడా కష్టమే
- పోలీసులు ఉన్న కొద్దిసేపు ఖాళీగా..
- వారు వెళ్లిపోతే జనానికి అగచాట్లే





గాంధీచౌక్‌లో నాలుగు రోడ్ల కూడలిలో అడ్డంగా ఆపిన ఆటోలు, 108 వాహనం వస్తున్న సమయంలోనూ అడ్డుగా ఉన్న ఆటోలు

తెనాలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్యారిస్ అని గొప్పగా చెప్పుకునే తెనాలికి గాంధీ చౌక్ నడిబొడ్డు. ప్రధాన వ్యాపార కూడలి కూడా. అత్యంత రద్దీగా ఉండే ఈ నాలుగు రోడ్ల కూడలి ప్రదేశం ఎట్లా ఉండాలి? ఏ రోడ్డు నుంచి ఏ వాహనం ఏసమయంలో వచ్చినా ఒక్క క్షణం కూడా ఆగకుండా వెళ్లిపోయేలా పగడ్బందీగా ట్రాఫిక్ నియంత్రణ ఉండాలి. కానీ పరిమిత సమయాల్లో మినహా పోలీస్ ఇక్కడ కనిపించరు. పట్టణానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నా సిబ్బందీ కరువే. సంచార వాహనాల్లో తిరిగే పోలీసులు మాత్రం వాహనాలకు సైరన్ మోగించుకుంటూ తిరగటం మినహా ట్రాఫిక్‌ను నియంత్రించే పరిస్థితి తక్కువేనేది జనం మాట. వారి వాహనాలకు అడ్డుగా ఆటోలున్నా కనీసం వాటిని పక్కకు పంపే ప్రయత్నమూ చేసేదిలేదని, ఒకవేళ ఎవరైనా పోలీస్ అధికారి కేకలు వేసినా ఆ సమయంలో పక్కకు వెళ్లినట్టే వెళ్లి, మళ్లీ ఆటోలను తీసుకొచ్చి మళ్లీ రోడ్డుకు అడ్డుగా పెట్టేయటం వీరి ప్రత్యేకత. పోలీసులు వెళుతున్నప్పుడు వారి పరిస్థితే ఇట్లాఉంటే... ఇక సామాన్యుల అవస్థలు ఎట్లా ఉంటాయనేది చెప్పనవసరం లేదు. ప్రతిరోజూ సాయంత్రం నుంచి కేవలం మూడు నుంచి నాలుగు గంటలు మాత్రమే పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో ఉంటారు. ఆ సమయంలో ఆటోలను అనుమతించరు. వారు ఉన్నప్పుడు మాత్రం అంతా ఖాళీగా కనిపిస్తుంది. అదే సెలవు రోజుల్లో అయితే ఒక్క పోలీస్ కానిస్టేబుల్ కూడా పత్తా ఉండరు. ఆ సమయాల్లో ఆటోలు, తోపుడు బళ్ల వారిదే రోడ్డుపై హవా అంతా. పోలీసులు ఉన్నప్పుడు మినహా మిగిలిన సమయాల్లో ఇక్కడ అడుగు పెట్టాలంటే పద్మవ్యూహాన్ని ఛేదించినట్టే. మహిళలయితే అనేక కష్టాలను ఎదుర్కొనటం, ఎవరికీ చెప్పలేక పక్కకు వెళ్లిపోవటం పరిపాటిగా మారిపోయింది. దీనికి కారణం... ఆ ప్రదేశం ఆటోలకు స్థావరంగా మారిపోవటమే. ఇది చాలదన్నట్టు తోపుడు బళ్లపై పండ్లు అమ్మే చిరు వ్యాపారులూ వారికి పోటీగా రోడ్డుపైనే బళ్లు ఆపేసి వ్యాపారం చేస్తుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పటంలేదు. బుర్రిపాలెం రోడ్ నుంచి మార్కెట్ రోడ్డులోకి కానీ, బోస్ రోడ్ నుంచి మార్కెట్ రోడ్డులోకి కానీ వెళ్లాలంటే ఆటోలను తప్పించుకుంటూ వెళ్లాల్సిందే. పాసింజర్ల కోసం రోడ్డుపై అడ్డుగా ఆటోలు ఆపేసి కూర్చుంటే ఎట్లా వెళ్లేదంటూ ఎవరైనా వాహనదారు ప్రశ్నించారా! అంతే సంగతులు. వారిపై దౌర్జన్యాలకు దిగటం, శృతిమించి దాడులు చేస్తున్న పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. వీరే కాకుండా రోడ్డుపైనే అడ్డుపెట్టి మరీ వ్యాపారం చేసుకునే తోపుడు బళ్ల వ్యాపారుల్లో కొందరు కూడా వీరికి తగ్గట్టుగానే దాడులకు దిగుతున్న పరిస్థితులూ ఉన్నాయంటున్నారు. సాధారణంగా బండ్లపై పండ్లు అమ్ముకోవటం అంటే చిరు వ్యాపారులు కదా! బ్రతుకుదెరువు కోసం అవస్థలు పడుతున్నారని ఎవరైనా జాలిచూపిస్తారు. కానీ తెనాలిలో మాత్రం కొన్ని బళ్ల వ్యాపారులు దందాలకు దిగటం, దౌర్జన్యాలు, దాడులకు పాల్పడటం కూడా పరిపాటిగా మారిపోయిందని చెబుతున్నారు. ఇదే తరహాలో పాత బస్టాండ్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి దగ్గర, రైల్వే స్టేషన్, బస్టాండ్ దగ్గర ఆటోలు, తోపుడు బళ్లవారి దౌర్జన్యం అంతా ఇంతా కాకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా తమపై దాడులు చేశారని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవటం లేదని, గత ప్రభుత్వ కాలంలో అసలు పూర్తిగా ట్రాఫిక్ నియంత్రణ గాలికొదిలేశారని, ఇప్పుడు ప్రభుత్వం మారినా అదే పరిస్థితి కొనసాగుతోందనేది వారి ఆవేదన. కొన్ని సందర్భాల్లో పోలీసులు సిబ్బంది ఎదుటే దౌర్జన్యాలకు దిగుతున్నా పట్టించుకోవటంలేదని, మీ కళ్లెదుటే జరుగుతుందికదా! న్యాయం చేయండని ప్రాదేయపడినా, నేను డ్యూటీ దిగిపోయాననో, వేరే కేసు పనిపై వెళుతున్నాననో చెప్పి స్టేషన్‌కు వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చి తప్పించుకుపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా పోలీసులు వెళ్లిపోయే సందర్భాల్లో ఆటో డ్రైవర్‌లు కొందరు మరింత రెచ్చిపోవటం, మా దగ్గర రోజూ మామూళ్లు దండుకుంటూ మమ్మల్నేమి చేస్తారంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండటం పరిపాటి. ఏది ఎట్లాఉన్నా, పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీతో ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారిపోతే, రోడ్లు కూడా ఇరుకైపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాఫిక్‌కు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయటం, ప్రధాన కూడళ్లలో రద్దీ సమయాల్లో కూడా పర్యవేక్షణ చూపటం ప్రస్తుతం చాలా అవసరంగా మారింది. కనీసం కొద్దిరోజులయినా ట్రాఫిక్‌ను గాడిలో పెడితే, జనం అలవాటుపడిపోవటంతోపాటు, ఆటోలు, బళ్ల పార్కింగ్‌లో విచ్చలవిడితనం తగ్గి, కొతయినా ట్రాఫిక్ కష్టాలు తీరే పరిస్థితి ఉంది.




పోలీసులు ఉన్న సమయంలో ఖాళీగా ఉన్న గాంధీ చౌక్

## వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● వైద్యాధికారి డాక్టర్ హనోక్‌బాబు



తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వాటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాండురంగపేట అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ హనోక్‌బాబు చెప్పారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వడదెబ్బపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలలో ఎండలు పగటి ఉష్ణోగ్రతలు అధికంగా పెరిగే అవకాశం ఉందన్నారు. శరీరం అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేదని చెమటలు, ఇతరరూపేణా శరీరంలోని నీరు బయటకు వెళ్లి డీహైడ్రేట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. సగటున 30శాతం జనాభా ఎండల్లో సైతం పనులు చేయాల్సిన పరిస్థితి ఉందని వారిలో ఎక్కువగా రైతు కూలీలు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు అధికంగా ఉంటారన్నారు. సాధారణ ఎండలో పనిచేసే మాదిరిగానే పనులకు వెళ్తే అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బ లక్షణాలు శరీరం అధికవేడి కలిగి ఉండటం, స్పృహ కోల్పోవడం, కళ్లు తిరగటం, వాంతులు, వికారం వంటి పలు అనారోగ్య సమస్యలు రోగిలో చూడవచ్చన్నారు. వీరిని తక్షణమే చల్లని ప్రాంతంలో ఉంచి గాలి ఆడేలా చూడాలన్నారు. ఏఆర్‌ఎస్, మజ్జిగ, పండ్ల రసాలు అందిస్తూ వైద్యశాలకు తీసుకువెళ్లాలన్నారు. వైద్యుల సూచనలు పాటిస్తే త్వరితగతిన కోలుకుంటారన్నారు. ఎండలో పనిచేసేవారు తెల్లటి రుమాలును తలకు కట్టుకోవాలని, టోపీలు ధరించాలని గంట గంటకు తాగునీరు తీసుకుంటూ ఉంటే డీహైడ్రేట్ గురికాకుండా ఉండవచ్చని, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వేసవిలో కూడా ఆరోగ్యకరంగా జీవించవచ్చని డాక్టర్ హనోక్‌బాబు తెలిపారు.



మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

● రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు శ్రీనివాసరావు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించేందుకు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పెంచాలని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో పినపాడు రోడ్డులో శుక్రవారం మొక్కలు నాటారు. సమాజంలో పలు సేవా కార్యక్రమాలను క్లబ్ నిర్వహిస్తుందన్నారు. నానాటికి కాలుష్యం పెరుగుతోందని ఇందుకు పరిష్కారంగా పెద్దఎత్తున మొక్కలు నాటి సంరక్షించడమేనన్నారు. కార్యదర్శి మురళీకృష్ణ, లోకేష్, ఈదర వెంకటపూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, చేతన్‌రాజు, నల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ జీవనలత, ఆలపాటి వెంకట్రామయ్య, నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

## ఇటుక రాయితో దాడి.. ఒకరికి గాయాలు



గాయపడిన ఉన్నం గోపి


తెనాలి రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో ఇటుక రాయితో వ్యక్తిపై దాడిచేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొలకలూరుకు చెందిన ఉన్నం గోపి గ్రామంలోని సమాధులతోట వద్ద రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని నిలపాడు. అదే క్రమంలో మద్యం తాగి వచ్చిన మరో యువకుడు అతడి వాహనాన్ని తీయాలని చెప్పాడంతో వారి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే ఇటుకరాయితో మద్యం తాగిన వ్యక్తి గోపిపై దాడిచేశాడు. దీంతో తీవ్రగాయాలతో ఉన్న బాధితుడిని స్థానికులు జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ శివకుమార్

## 92.3 శాతం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులలో 92.3 శాతం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ప్రకాశం రోడ్డులోని కళాశాలలో శుక్రవారం ఉద్యోగాలు పొందిన అందరితో అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులను 18కి పైగా కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయన్నారు. టీసీఎస్, విప్రో, టెక్ మహేంద్ర, ఐఎల్ఎం వంటి పలు దిగ్గజ సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. తమ కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రముఖ సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకుని ఆ సంస్థలకు కావాల్సిన నైపుణ్యాలను విద్యార్థుల్లో కలుగజేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు రాజీవ్, శర్మ తదితరులు పాల్గొన్నారు.



వల్లభాపురం సమీపంలో రేపల్లె కరకట్టపైన రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

## రేపల్లె కరకట్ట రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

● వారం రోజులైనా పట్టించుకోని అధికారులు

కొల్లిపర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల క్రితం గాలితో కూడిన వర్షం పడింది. దీంతో వల్లభాపురం సమీపంలో రేపల్లె కరకట్టపైన గాలికి రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోయింది. చెట్టు పడిపోయి వారం రోజులు గడిచినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పడిపోయిన చెట్టును సంబంధిత అధికారులు తొలగించకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రయాణించే వారికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా చెట్టును తొలగించకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

## చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. శుక్రవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు కరేటి పుల్లారావు, సురేఖ దంపతుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, తాగునీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, వాసు, ప్రదీప్, శేఖర్ పాల్గొన్నారు.

### మారీసుపేటలో...

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతి ప్రారంభించారు. మారీసుపేటలోని రెండు గేట్ల వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొసైటీ ఆధ్వర్యంలో సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస్, శివరామకృష్ణ, నాంచారయ్య, పణిదపు దుర్గాప్రసాద్, మురళీకృష్ణ, కౌన్సిలర్ లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహించారు. శుక్రవారం స్థానిక నందులపేటలోని శ్రీషిరిడిసాయి వృద్ధాశ్రమంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు డొక్కు చైతన్య, విజయలక్ష్మిల కుమారుడు సాయి శర్విల్ జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రాఘవ మృతి తీరనిలోటు: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు రావూరి రాఘవేంద్ర మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. టీడీపీ యువ నాయకుడు రావూరి రాఘవేంద్ర (35) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రాఘవేంద్ర మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రాఘవేంద్ర కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలియజేశారు. రాఘవేంద్ర మృతదేహాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. రాఘవేంద్రకు కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

# భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం ప్రార్థనలు




తెనాలిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు, పాస్టర్లు



వడ్లమూడిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ఆశీర్వాదం



తెనాలిలో శిలువ మోస్తున్న భకుడు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవులు శుభ శుక్రవారం ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఐతానగర్‌లోని రక్షణ సైన్యం చర్చిలో ప్రత్యేక ఆరాధనలు చేశారు. మేజర్ నాగరాజు మాట్లాడుతూ, ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలు భక్తులకు వివరించారు. రత్నసుందరి, రవికుమార్, జక్రయ్య, కనకరత్నం పాల్గొన్నారు. బోసురోడ్డులోని టౌన్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. ఐతానగర్, చినరావూరు తదితర ప్రాంతాల్లో సిలువను మోస్తున్న సన్నివేశాలను ప్రదర్శించారు.

### కొల్లిపరలో...

కొల్లిపర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొల్లిపర, వల్లభాపురం, పిడపర్రు, పిడపర్తిపాలెం, తూములూరు, దావులూరు, అన్నవరం, అన్నవరంలంక, దావులూరిపాలెం, చెముడుబాడు, చివలూరు, సిరిపురం, దంతలూరు, కుంచవరం తదితర గ్రామాల్లో క్రైస్తవులు, మహిళలు ఉపవాసాలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు ఎం.సుమన్‌బాబు, గోదా జయపాల్, మోహన్‌రావు, కనపర్తి జాకబ్ క్రీస్తు శిలువపై ప్రభోదించిన ఏడు సూక్తులను భక్తులకు సందేశాన్ని అందించారు.

### పొన్నూరులో...

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో అన్ని ప్రధాన ప్రార్థన మందిరాలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజుగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని పాత పొన్నూరు, క్రీస్తు శత వార్షిక లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ కనపర్తి ఆశీర్వాదం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలకు భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని నీతి సూత్రాలను ఆశీర్వాదం బోధించారు. ఏసుక్రీస్తు శిలువ ధారణ ద్వారా సర్వమానవాళికి మహత్తర సందేశాన్ని గుడ్ ఫ్రైడే ఇచ్చారనే నమ్మకంతో ఈ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈస్టర్‌కు ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్ ఫ్రైడేగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. పొన్నూరు పట్టణంలో క్రీస్తు శత వార్షిక లూథరన్ దేవాయంతో పాటు, నిడుబ్రోలులోని ఏఈఎల్‌సీ చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చి, క్రీస్తు ఉద్దాన దేవాలయం, తదితర ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తు త్యాగాలను స్మరిస్తూ మానవాళి పాపాలకు ప్రాయశ్చితంగా శిలువలో మరిణించిన దినంగా గుర్తిస్తూ గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. అలాగే చేబ్రోలు మండలంలోని వడ్లమూడిలో గుడ్ ఫ్రైడే ప్రానలు జరిగాయి. ఏఈఎల్‌సీ, పారిస్ సంఘం ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు ప్రభువు శిలువ ధారణ నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రసన్నకుమార్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొల్లిపర చర్చిలో దైవ సందేశాన్ని ఇస్తున్న పాస్టర్ సుమన్‌బాబు

# నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరిస్తాం

● ఆకస్మికంగా వాహనాల తనిఖీ
● డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ డివిజనల్ పరిధిలో నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ జనార్ధనరావు హెచ్చరించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో తెనాలి డివిజన్ పరిధిలోని పోలీసులతో మంగళగిరి తెనాలి ప్రధాన రహదారిపై వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్లు, ద్విచక్రవాహనాలు, లారీలు, ఆటోలు వంటి వాటిని నిలుపుదల చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు వంటివాటిని తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నిబంధల ప్రకారం నడుచుకోని పలువురు వాహనదారులకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తెనాలి సబ్ డివిజనల్ పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా బాధ్యతగా పనిచేస్తున్నాం అన్నారు. రాత్రుళ్లు నేరప్రవృత్తి కల్గిన వ్యక్తుల సంచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో సబ్‌డివిజన్ వ్యాప్తంగా సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారని ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. అందులో పలువురు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇతర నిబంధలను పాటించని వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. ఈ తనిఖీలు ముందుముందు కూడా కొనసాగిస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్‌ఐలు ప్రకాష్‌రావు, కరిముల్లా, బ్రహ్మయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, ఎస్ఐ ప్రకాష్‌రావు తదితరులు



మంటలను అదుపు చేసే పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

## అప్రమత్తతతోనే ఆస్తి, ప్రాణ నష్టం నివారణ

ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తతతోనే ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని గ్యాస్ గోడౌన్‌లో పెట్రోలు బంకుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పెట్రోలు బంకులలో గ్యాస్ గోడౌన్‌ల వద్ద మంటలు చెలరేగితే మంటలను అదుపుచేసే పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. మంటలు చెలరేగినప్పుడు భయపడకుండా సిబ్బంది ఫోమింగ్ చేయడం, రసాయనాలు వెదజల్లడం ద్వారా మంటలను అదుపు చేయడంతో పాటు భారీ ఎత్తున జరిగే ఆస్తి, ప్రాణ నష్టాలను సమర్ధవంతంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.